క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: టింపనీ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయకుడు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు టింపనీ 11కేవీ ఫీడర్ పరిధిలోని ప్రగతి పార్కు ఏరియా, టింపనీ స్కూల్ ఏరియా, వుడా ఫేజ్–2 ఏరియా, భరత్‌నగర్, అమరావతినగర్ ఏరియా తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం తప్పదన్నారు.

శ్రీవారి వెండి పాదుకల కోసం విరాళం



ఆలయ అర్చకులకు నగదును అందజేస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కొలువైన తిరుమల బాలాజీకి వెండి పాదుకల నిమిత్తం ఏలూరుకు చెందిన వంకినేని పిచ్చయ్య చౌదరి, కనకలక్ష్మి దంపతులు రూ.52 వేల విరాళాన్ని అందజేశారు. గురువారం శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ట్రస్ట్ ప్రతినిధుల సమక్షంలో ఆలయ అర్చకులకు నగదును అందజేశారు.

జీతాలు చెల్లించాలంటూ ఆందోళన



స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఉపాధ్యక్షుడు వీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ అంశంపై గురువారం యూనియన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ముందు ధర్నా చేశారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో 86 మంది కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారికి ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల జీతాలు చెల్లించలేదన్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రిన్సిపుల్ ఎంప్లాయర్‌గా యాజమాన్యమే వారికి జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బొట్ట గంగరాజు, సోమేష్, మల్లు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక సేవలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఆషాఢ మాసంలో శ్రీవారికి ప్రత్యేక సేవలు నిర్వహించనున్నట్లు దివ్యక్షేత్రం ప్రతినిధులు గురువారం తెలిపారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీవారికి తిరుప్పావడ సేవను నిర్వహించనున్నట్ల తెలిపారు. 17న తొలిఏకాదశి సందర్భంగా ఉదయం 9 గంటలకు ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం

గాజువాక : గాజువాకలో విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. విద్యారంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని, ఎన్‌టీఏ, నీట్ పరీక్షల పేపర్ లీకేజీలపై సమగ్ర విచారణ జరపాలని, పేపర్ లీకేజీల వల్ల నష్టపోయిన విద్యార్థులకు తక్షణమే న్యాయం జరగాలంటూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాకలో పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు బంద్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా విద్యార్థి సంఘాల నాయకులు కె.సాయి, చందు, సుధీర్, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

విప్లవ స్ఫూర్తి అల్లూరి



గాజువాకలో రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు



క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రగడ వేణుబాబు

గాజువాక :మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు పలువురు నాయకులు గురువారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అల్లూరి జయంతిని గాజువాక క్షత్రియ సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీనగర్‌లోని సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో నిర్వాహకులు, యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో క్షత్రియ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం.వి. సుబ్బరాజు, దీనంకొండ కృష్ణంరాజు, నాయకులు జీఎస్ఎన్ రాజు, కాలనీ పెద్దలు త్రినాథస్వామి, జి.కనకరాజు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి గాజువాక బీజేపీ నాయకులు నివాళులర్పించారు. ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు వి.రోహిణి, గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో..

అగనంపూడి: విప్లవ వీరుడు, మన్నెం ముద్దు బిడ్డ అల్లూరి సీతారామరాజుకు పలు సేవా సంఘాలు, క్షత్రియ సేవా సంఘాలు ఘనంగా నివాళులర్పించాయి. 87వ వార్డు రాజులపాలెంలో నిర్వహించిన అల్లూరి జయంతి వేడుకల్లో గాజువాక మున్సిపల్ మాజీ చైర్మన్ వీవీఎస్ఎం.రాజు, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్లస్టర్ కో ఆర్డినేటర్ వాడపల్లి రామచంద్రరాజు, బెల్లకొండ సీతారామరాజు, తిలక్‌రాజు, అశోక్‌రాజు పాల్గొన్నారు. వడ్లపూడి క్షత్రియ సేవా సంఘం సారథ్యంలో అల్లూరి పార్కు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముద్దపు దామోదర్, ఎస్.పాపారావు, ప్రగడ శంకరరావు, సబ్బవరపు ఈశ్వరరావు, దాసరి అప్పడు, దుగ్గపు దానప్పలు, మల్ల రాము, కోటి, బెల్లంకొండ తిలక్‌రాజు, అప్పలరాజు, సుబ్బరాజు పాల్గొన్నారు. నిర్వాసితకాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, ఆడారి శ్రీను, చిత్రాడ రమణ, తిలక్‌రాజు, సుబ్బరాజు, హరీష్, అప్పలరాజు పాల్గొన్నారు.79వ వార్డు పాత అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనక భవానీ, వెంకటరావు, పాల్గొన్నారు. పాత అగనంపూడి సత్రం కూడలిలో మహాత్మా గాంధీసేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఘన నివాళులర్పించారు. సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, నాయకులు కరణం పైడిరాజు, వీరభద్రరావు పాల్గొన్నారు.

విప్లవజ్యోతి అల్లూరి సేవలు మరువలేం

పెదగంట్యాడ: విప్లవజ్యోతి, మన్యం దొర అల్లూరి సీతారామరాజు సేవలు మరువలేమని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పి.వెంకటరమణ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో అల్లూరి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో ప్రాణాలను అర్పించిన అల్లూరిని స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు రాంబాబు, హరి, పురుషోత్తం, సుధాకర్, దేవి, నవ్య తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో..

ఉక్కునగరం: స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఉక్కునగరంలో ఘనంగా నిర్వహించారు. గురువారం సెక్టార్–6 అల్లూరి కూడలి వద్ద ఉక్కునగరం క్షత్రియ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టౌన్ అడ్మిన్ విభాగం డీజీఎం వీఎస్. భాస్కరరావు పూలమాలలు వేసి అల్లూరికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన మహావ్యక్తి అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో క్షత్రియ సంఘం నాయకులు కె.వి. సుబ్బరాజు, వేణువర్మ, సాయిరామ రాజు, సతీష్ వర్మ, వివిధ కార్మిక సంఘాల నాయకులు యు. రామస్వామి, కేవీఎస్. రాజు, బి.సత్యనారాయణ, రాజబాబు పాల్గొన్నారు.స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. సెక్టార్–5 అల్లూరి విగ్రహానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వై. మస్తానప్ప, మార్టుపూడి పరదేశి, పిట్టారెడ్డి, గుణశేఖర్, కర్రి రత్నరాజు, పి. బ్రహ్మయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఉక్కులో అల్లూరికి నివాళులర్పిస్తున్న టౌన్ అడ్మిన్ డీజీఎం, నాయకులు



అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి వెంకటరమణ, పాఠకులు



రాజులపాలెంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కోమటి శ్రీనివాసరావు

విద్యుత్ బిల్లులు.. మారిన చెల్లింపులు

- గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు కుదరవు
- ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్..మొబైల్ యాప్ ద్వారా మాత్రమే చెల్లింపులకు అవకాశం

పెదగంట్యాడ: గతంలో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు గంటల తరబడి క్యూ లైన్లలో వినియోగదారులు వేచి ఉండాల్సి వచ్చేది..లైన్లో నిలబడలేని వారికి బిల్లులు చెల్లింపులో జాప్యం జరిగేది. దీంతో అలాంటి వారు జరిమానాలతో కలిపి బిల్లులు చెల్లించాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో మారిన సాంకేతికతకు అనుగుణంగా గూగుల్ పే.. ఫోన్ పే.. పేటీఎం, అమెజాన్ పే తదితర యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించే వెసులుబాటును విద్యుత్ సంస్థ కల్పించింది. మొదట్లో తక్కువగానే వీటి ద్వారా చెల్లింపులు జరిగినా మెల్లగా పుంజుకున్నాయి. ఈ కారణంగా అటు వినియోగదారులకు సమయం ఆదా కావడంతో పాటు క్యూ లైన్లలో నిలబడాల్సిన బాధ్యత తప్పింది.

80 శాతం ఆన్‌లైన్ చెల్లింపులే..

మండల పరిధిలో సుమారు 50 వేలకు పైగా గృహ విద్యుత్ సర్వీసులు ఉన్నాయి.. మరికొన్ని హెచ్‌డీ సర్వీసులు, పరిశ్రమల సర్వీసులు కూడా ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రతి నెలా కోట్ల రూపాయలు విద్యుత్ సంస్థకు ఆదాయం సమకూరుతోంది. 80 శాతం వరకూ వినియోగదారులు ప్రతి నెలా ఫోన్ పే, గూగుల్ పే, అమోజాన్ పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. 20 శాతం వరకూ విద్యుత్ కేంద్రాల వద్ద చెల్లింపులు జరుపుతున్నారు.



ఏపీఈపీడీసీఎల్ ముద్రించిన పోస్టర్

ఆర్‌బీఐ కొత్త నిబంధనలు

ఈ ఏడాది జూలై 1 నుంచి ఆర్‌బీఐ కొత్త నిబంధనలు తీసుకువచ్చింది. విద్యుత్ బిల్లుల చెల్లింపులను యాప్‌ల ద్వారా నిలిపి వేసింది. ఫోన్ పే, గూగుల్ పే, అమోజాన్ పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా చెల్లింపులు చేయడం వల్ల విద్యుత్ సంస్థకు ఆ సొమ్ము జమ కావడంలో జాప్యం కావడంతో ఇలాంటి చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. విద్యుత్ శాఖ రూపొందించిన యాప్ లేక

ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్
www.apeasternpower.com
మొబైల్ యాప్ : eastern power (గుగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి)

వెబ్‌సైట్‌లో వినియోగదారులు తమ బిల్లులను చెల్లిస్తే నేరుగా ఆ సంస్థకు ఆ సొమ్ము జమ అయ్యేలా రూపకల్పన చేసినట్టు చెబుతున్నారు.

అవగాహన కరవు

వివిధ కారణాల వల్ల ఆర్‌బీఐ తీసుకువచ్చిన నిబంధనల కారణంగా చాలా మంది వినియోగదారులు ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి. కొత్తగా విద్యుత్ శాఖ తీసుకువచ్చిన సౌకర్యంపై ఇప్పటి వరకూ వినియోగదారులకు అవగాహన లేదు. విద్యుత్ శాఖాధికారులు స్పందించి ఈ విషయంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రజలు సహకరించాలి



ఇకపై విద్యుత్ శాఖ యాప్ లేదా వెబ్‌సైట్‌లో మాత్రమే వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించాలి. జులై 1 నుంచి ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమోజాన్ తదితర యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులను నిలిపి వేశాం. ప్రజలు ఈ విషయంలో సహకరించాలి.

–డి.శివ దుర్గాప్రసాద్, ఏఈ, పెదగంట్యాడ

బాల్య వివాహాలపై కళాజాత



కళాజాతలో గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

గాజువాక: బాల్య వివాహాలవల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన కళాజాత అందర్నీ ఆకట్టుకుంది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 66వ వార్డు అజీమాబాద్ అంగన్వాడీ కేంద్రంవద్ద గురువారం కళాజాత నిర్వహించారు. కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు, మహిళలకు బాల్య వివాహాలవల్ల తలెత్తే ఇబ్బందులను కళాకారులు ఆట, పాటలద్వారా వివరించారు. బాలల హక్కులు, చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం తదితర అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి, అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.కె.మునీరా బేగం, ప్రవీణ, కళాజాత సభ్యులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎంకు సత్కారం



ఉక్కు శివాలయంలో జీఎం సంజీవరావును సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం కె.సంజీవరావును ఉక్కు బీసీ గేటు శివాలయంలో సత్కరించారు. మాస శివరాత్రి సందర్భంగా ఉక్కు బీసీ గేటు శివాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న జీఎం సంజీవరావును ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఏటా జరిగే మాసోత్సవాల్లో ఉక్కు పరిసర ప్రాంతాల భక్తులు ఆలయాన్ని దర్శించుకునే అవకాశం జీఎం సంజీవరావు వల్లే కలిగిందన్నారు. ప్లాంట్ అభివృద్ధి కోసం సంజీవరావు చేసిన సేవలు నిరుపమానమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎల్లేటి శ్రీనివాస్, భద్రు నాయక్, రమేష్‌బాబు, కనకరెడ్డి, నాగభూషణం, ఎన్. శ్రీనివాస్, వర్మ, లలితారావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు మొల్లి ఈశ్వరరావు, ఎస్.ఎ. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రంగా ఆశయ సాధనకు పునరంకితం కావాలి



రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

గాజువాక : వంగవీటి మోహనరంగా 77వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. అలేగా గాజువాక కాపు యువత ఆధ్వర్యంలో గురువారం వంగవీటి మోహనరంగాకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనగర్‌లోని రంగా విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడివాడ లతీష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎవ్వరికీ లేని ఆదరణ వంగవీటి మోహనరంగా సంపాదించుకున్నారన్నారు. అనంతరం పేద మహిళలకు చీరలు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ స్టాలిన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేదవర్గాల హక్కులను సాధించాలన్న దివంగత వంగవీటి రంగా ఆశయ సాధనకు ఆయన అభిమానులు పునరంకితం కావాలని బీజేపీ నాయకుడు జీవీఎల్ నర్సింహారావు అన్నారు. రంగా 77వ జయంతి సందర్భంగా స్థానిక సంద్రానిపాలెంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, స్థానిక నాయకులు, కాపు సంఘాల ప్రతినిధులు కొసిరెడ్డి గణేష్, కంఠంరెడ్డి మనోజ్, భార్గవ్, జెర్రిపోతుల ముత్యాలు, బొండా ఎల్లాజీరావు, గూటూరు శంకరరావు, జీలకర్ర భువనేశ్వరి, కట్టా పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితునికి ఆర్థిక సాయం



నగదును అందిస్తున్న స్పందన చేయూత సంస్థ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పాత అగనంపూడికి చెందిన క్యాన్సర్ బాధితుడు చోడవరపు గణేష్ కుటుంబానికి స్పందన చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందించారు. బాధితుని ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గణేష్, ఆయన కుటుంబ సభ్యులకు రూ.5వేలు అందించారు. ఈ కార్యక్రమంలో స్పందన చేయూత సంస్థ చైర్మన్ ఈపూరి బుచ్చిరాజు, ప్రతినిధులు ఎస్.వి.ఎల్.ఆనంద్, గుదే సుశీలా గజేంద్రరావు, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పట్టా రామ అప్పారావు, ఎం.మస్తాన్‌రెడ్డి, కరణం సత్తిరాజు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు పెంచాలి



ఆటోనగర్ ఏఈపీ – బ్లాక్‌లో మొక్కలు నాటుతున్న ఐలా చైర్మన్ రఘు ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: పర్యావరణాన్ని పరిరక్షించాలంటే మొక్కలను విరివిగా పెంచాలని ఆటోనగర్ ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), కార్యదర్శి చీకటి సత్యనారాయణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం ముగింపు వేడుకలు ఆటోనగర్ ఏఈపీ – బ్లాక్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఐలా, వాసీవా ప్రతినిధులు, ఎంఎస్‌ఎంఈ అధికారులు, పారిశ్రామికవేత్తల చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐలా ప్రతినిధులు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో జూన్ 5వ తేదీ నుంచి జూలై 4వ తేదీ వరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవాలను ఘనంగా నిర్వహించామన్నారు. పలు బ్లాక్‌లలో వందలాది మొక్కలు నాటామన్నారు. కాలుష్య రహిత ప్రాంతంగా పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌ను తీర్చి దిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో ఐలా వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, కోశాధికారి కె.పద్మావతి, సభ్యులు విశాలక్ష్మి, జె.కె.కోటేశ్వరరావు, వాసీవా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి పర్చూరి ప్రభాకర్, ఎంఎస్‌ఎంఈ ఏడీ చంద్రమౌళి, ప్రభాకర్ కుమార్, ఐలా మాజీ చైర్మన్లు శేషగిరిరావు, కొల్లి సత్యనారాయణ, వై.సాంబశివరావు, పారిశ్రామిక వేత్తలు కృష్ణ ప్రసాద్, హార్మోని బాలాజీ, ఫిట్టర్ రెడ్డి, రవి ఫ్యాబ్రికేటర్స్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రైన్ కోట్ల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు రైన్‌కోట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పారిశుధ్య కార్మికులకు వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు రైన్ కోట్లు పంపిణీ చేశారు. అగనంపూడి వారపు సంత ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు లెక్కచేయకుండా అంకితభావంతో పనిచేసే కార్మికులకు రైన్ కోట్లు అందిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.కోటేశ్వరరావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మాడిశ వెంకట్రావు, సింగిడి సింహాచలం, పల్లెల నాగేశ్వరరావు, గళ్ల హరిత పాల్గొన్నారు.


వైభవంగా అమ్మవార్ల అనుపోత్సవం



అమ్మవార్ల ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు చినఅక్కిరెడ్డిపాలెంలో శ్రీ దుర్గామాంబ, కుంచమాంబ అమ్మవార్ల పండగ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. చినఅక్కిరెడ్డిపాలెంలోని చదరంపట్టు వద్ద అమ్మవార్ల ప్రతిమలను ప్రతిష్టించి నిత్యం ఘటాలను ఊరేగించారు.

భెల్ నూతన ఏజీఎంకు అభినందనలు



భెల్ నూతన ఏజీఎం లీలను అభినందిస్తున్న సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: హైదరాబాద్ భెల్ (హెచ్‌పీసీఎల్) యూనిట్‌నుంచి విశాఖకు బదిలీపై వచ్చిన ఏజీఎం (హెచ్‌ఆర్) ఎస్.లీలను సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆమె సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వేల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు, సీనియర్ మేనేజర్లు జి.చంద్రశేఖర్, ఏ.మధుసూదన్, డీజీఎంలు జి.మహేష్, సీహెచ్.మహేష్, అసోసియేషన్ ప్రతినిధులు హెచ్.భోగేష్, జి.కిరణ్, పి.శ్రీను, ఆదినారాయణ, బి.రాజ్ కుమార్, పి.విశ్వాసరావు, జె.జయప్రకాష్, ప్రశాంత్ కుమార్, వై.వి.రమణ, కె.ప్రసాదరావు, రమేష్, జి.సుధాకర్ బాబు, ఎం.వి.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తగ్గింపు నిర్ణయాన్ని ఉపసంహరించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులను 20 శాతం తగ్గించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓ.వి. రావు డిమాండ్ చేశారు. గురువారం ఎల్‌ఎంఎం పార్కులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కులో ఇప్పటికే పర్మినెంట్ కార్మికులు వేలాదిమంది రిటైర్ అయినందున ఆ పనిభారం కాంట్రాక్ట్ కార్మికులపై పడుతుందన్నారు ఈ పరిస్థితుల్లో కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే ప్లాంట్ పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కలుగ చేసుకుని కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో నమ్మి రమణ, జి. శ్రీనివాసరావు, సోమేష్, మసేను, శశిభూషన్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామరాజు సేవలు ఎనలేనివి



సీతారామరాజును సత్కరిస్తున్న నాయకులు

అగనంపూడి: ఐఎన్‌టీయూసీ నాయకుడిగా, నిర్వాసిత సంఘ నాయకుడిగా సాగి సీతారామరాజు చేసిన సేవలు ఎనలేనివని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు అన్నారు. ఉక్కు కార్మికుడిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సీతారామరాజును కణితిలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు.